సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 2 । మార్చి । 2023



ప్రాణం తీసిన ఈత సరదా

సరదాగా ఈతకెళ్లి పాలిటెక్నిక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన అన్నమయ్య జిల్లా పీలేరు మండలంలో చోటు చేసుకుంది. - 8లో



జల్సాల కోసం అక్క ఇంటికే కన్నం

జల్సాల కోసం అక్క ఇంటికే కన్నం వేసి దోచుకున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు బి.కొత్త కోట ఎస్ఐ రామమోహన్ తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 187 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	490	610
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 138.22 కిలోలు

న్యూస్‌రీల్

ఎరువులపై రైతులకు సమాచారం అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

గుర్రంకొండ: ఆర్బీకేల్లో నిల్వ ఉన్న ఎరువులపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని టి.పసలవాండ్లపల్లె, నడిమికండ్రిగ, చెర్లోపల్లె గ్రామాల్లోని ఆర్బీకేల్లో ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్బీకేల్లో రిజిస్టర్లు, ఎరువుల స్టాకు, పంపిణీ రిజిస్టర్లను పరిశీలించారు. రబీసీజన్‌లో ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం గుర్రంకొండ మండలానికి సంబంధించి రబీ సీజన్‌లో 2420 ఎకరాలను ఈ పంటలో నమోదు చేశారన్నారు. మొత్తం 1517 మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారని తెలిపారు. సమాచార బోర్డుల్లో ఎరువుల ధరలు, రోజువారీ స్టాకు వివరాలు నమోదు చేయాలన్నారు. రైతులు అడిగిన మేరకు అవసరమైన ఎరువులను అందించే బాధ్యత ఆర్బీకే సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ రత్నమ్మ, వీహెచ్‌ఏలు హేమ, రెడ్డిమద్దక్క, తరుణ్‌నాయక్‌లు పాల్గొన్నారు.

1100 కిలోల రేషన్‌బియ్యం స్వాధీనం




పోలీసులు స్వాధీనం చేసుకున్న ఐషర్ లారీ

మదనపల్లె: రేషన్ బియ్యాన్ని సేకరించి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 1100 కిలోల బియ్యాన్ని బుధవారం రాత్రి సీజ్ చేసినట్లు రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. రాయచోటి పట్టణంలోని నయాబ్‌వీధికి చెందిన జమీల్‌బాషా(40), అదేవిధంగా మండలంలోని కొత్తపల్లెకు చెందిన ఖాదర్‌బేగ్(58) పడమటి ప్రాంత మండలాలైన గుర్రంకొండ, వాల్మీకిపురం, నిమ్మనపల్లె, మదనపల్లెలో రేషన్‌బియ్యం సేకరించి కర్ణాటకకు అక్రమంగా తరలించే వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో నిందితులు ఇద్దరు బుధవారం మండలంలోని వలసపల్లె పంచాయతీ జన్నేవారిపల్లె వద్ద ఐషర్ మినీలారీలో 22 బ్యాగుల్లో (ఒకొక్కబ్యాగులో 50కిలోలు) రేషన్‌బియ్యం తీసుకొస్తుండగా పట్టుకున్నామన్నారు. బియ్యం తరలిస్తున్న వాహనానికి ఎస్కార్ట్‌గా వస్తున్న మరో కారును సైతం సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. సీజ్‌చేసిన బియ్యంతో పాటు వాహనాలను స్టేషన్‌కు తరలించామన్నారు. తాలూకా ఎస్ఐ సుధాకర్ నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రారంభమైన ఇంటర్వ్యూలు

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో గెస్ట్ ఫ్యాకల్టీకి సంబంధించి ఇంటర్వ్యూలు ప్రారంభమైనట్లు డైరెక్టర్ కె.సంధ్యారాణి తెలిపారు. బుధవారం స్థానిక ట్రిపుల్ ఐటీలోని అతిథి భవనంలో వివిధ సబ్జెక్టుల గెస్ట్ ఫ్యాకల్టీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఇంటర్వ్యూలకు 28 మంది అభ్యర్థులు హాజరు కాగా.. అందులో మ్యాథ్స్, తెలుగు సబ్జెక్టులకు 11మంది చొప్పున, ఇంగ్లీషు నలుగురు, బయాలజీకి ఇద్దరు చొప్పున హాజరయ్యారన్నారు. గురు, శుక్రవారాలు కూడా ఇంటర్వ్యూలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఏఓ జిలాని, అకడమిక్ డీన్ రత్నకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్, ఆపస్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో ఈనెల 5,6 తేదీల్లో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆపస్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షుడు పాగుల వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లు, సిక్కర్లును బుధవారం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్ ఆపస్ నాయకులతో కలిసి విడుదల చేశారు. జిల్లా మీడియా ఇన్‌చార్జ్ బాలకృష్ణుడు, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రమోహన్, రఘుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ ట్రాక్.. ఆటోమేటిక్

డ్రైవింగ్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు, కాలుష్య కారక వాహనాలపై తనిఖీని నిర్ధారించడానికి రవాణా విభాగం ఆటో మేటిక్ టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనుంది. డ్రైవింగ్ లైసెన్స్ ఆశించే అభ్యర్థులను సమర్థవంతంగా, పారదర్శకంగా పరీక్షించేందుకు దోహదపడుతుందని రవాణా శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

- అన్నమయ్య జిల్లాలో ఆర్టీఓ ఆఫీసుకు పది ఎకరాల కేటాయింపు
- సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్‌తోపాటు ఫిట్‌నెస్ సెంటర్ నిర్మాణాలకు ప్రణాళిక
- సుమారు రూ. 7 కోట్ల వ్యయంతో నిర్మించాలని ప్రతిపాదనలు
- ఇప్పటివరకు రాయలసీమలో రెండుచోట్ల మాత్రమే సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్‌లు
- రాయచోటిలోని దిగువ అబ్బవరం వద్ద ఏర్పాటుకు చర్యలు



సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్‌తో కూడిన సిస్టమ్

సాక్షి రాయచోటి : కాలం మారింది...కంప్యూటర్ యుగం వచ్చింది...ప్రతి వ్యవస్థలోనూ టెక్నాలజీ పెరగడంతో సాంకేతికత వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇటు ఉద్యోగులైనా...అటు సాఫ్ట్‌వేర్ రంగమైనా ఎటుచూసినా కంప్యూటర్‌లోనే కాలం గడిచిపోతోంది. అయితే వాహనాలకు సంబంధించి డ్రైవింగ్ ట్రాక్‌లను కూడా సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్‌లుగా మార్చి కంప్యూటర్ ద్వారా సర్టిఫికెట్లను జారీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందుకు తగ్గట్టుగా అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో రవాణాశాఖ కార్యాలయంతోపాటు ఇతర అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

రాయచోటిలో సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని దిగువ అబ్బవరం (ఎంఐజీ లే అవుట్ పక్కన) సుమారు 10 ఎకరాల్లో సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్‌తోపాటు ఆర్టీఓ కార్యాలయానికి వివిధ విభాగాలకు స్థల ఎంపిక చేశారు. రాయచోటికి సమీపంలోనే అద్భుతమైన వాతావరణంలోనే తీర్చిదిద్దనున్నారు. సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్ అంతా కూడా సమీపంలోని ఆర్టీఓ కార్యాలయంలోని కంప్యూటర్లకు అనుసంధానమై ఉంటుంది. పర్‌ఫెక్ట్‌గా ట్రాక్‌లో వాహనాన్ని నడిపితేనే పాస్ చేయడం... లేదా కొంచెం అటు, ఇటు వెళ్లినా కూడా కంప్యూటర్ ఫెయిల్ కింద రిజల్ట్ ఇచ్చేస్తోంది. అధికారులకు ఇక్కడ సంబంధం లేకుండానే వ్యవహారాలు నడుస్తాయి. ఇలాంటి సైంటిఫిక్ ట్రాక్‌లు రాయలసీమలో చిత్తూరు, అనంతపురంలలో మాత్రమే ఉన్నాయి. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో అధికారులు ఏర్పాటుకు అడుగులు వేయడంతో మరొకటి నిర్మితం కానుంది.

రూ.7 కోట్లతో నిర్మాణాలు

రాయచోటిలో పది ఎకరాల స్థలంలో సుమారు రూ. 7 కోట్లతో వివిధ నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించారు. అందుకు సంబంధించి అవసరమైన మొత్తానికి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కాగానే అవసరమైన నిర్మాణాలు మొదలు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే స్థల ఎంపిక పూర్తి కావడంతో నిధులు రావడమే తరువాయి నిర్మాణ పనులు చేపట్టనున్నారు.



రాయచోటి ఆర్టీఓ కార్యాలయంతోపాటు డ్రైవింగ్ ట్రాక్‌కు ఎంపిక చేసిన స్థలం

శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించాలి

- సకాలంలో ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలి
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించాలని అధికారులను జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి గిరీషా పీఎస్ ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ తమీమ్‌అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఓటర్‌స్లిప్పుల పంపిణీ సకాలంలో పూర్తి చేస్తామన్నారు. మెటీరియల్ స్థానికంగా కొనుగోలు చేసుకొని, పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ జరుగుతోందన్నారు. ప్రిసైడింగ్ అధికారులు, ఏపీఓలకు శిక్షణ ఇచ్చామన్నారు. మార్చి 8వ తేదీ మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇస్తామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేస్తున్నామన్నారు. పోలింగ్ విధులలో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌పై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తుతో పాటు అన్ని చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచుతున్నామని పేర్కొన్నారు.

పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేలా పీఓలు పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి గిరీషా పీఎస్ సూచించారు. బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై పీఓలు, ఏపీఓలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఓలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారన్నారు. ఈ ఎన్నికలలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం పోలింగ్ నిర్వహణలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 84 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అవసరం మేరకు బ్యాలెట్ బాక్సులు తీసుకెళ్లాలన్నారు. పోలింగ్ అధికారులు, సిబ్బందికి బ్యాలెట్ బాక్స్ తెరవడం, మూయడంపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 7.30 గంటలకు పోలింగ్ ఏజెంట్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారన్నారు. పోలింగ్ ప్రక్రియ మొత్తం వెబ్‌కాస్టింగ్ చేయిస్తామన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం వివరాలు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఓటు వేసే అభ్యర్థికి ఓటర్ స్లిప్పుతో పాటు ఏదో ఒక గుర్తింపుకార్డు తప్పకుండా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పీఓలు, ఏపీఓలకు బ్యాలెట్ బాక్స్ ఓపెన్, క్లోజ్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఆర్డీఓ రంగస్వామి, పీఓలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

పండుటాకుల పరవశం

మొదటి రోజు 87.66 శాతం పింఛన్లు పంపిణీ



పింఛన్ అందజేస్తున్న వలంటీర్, అధికారులు

రాయచోటి: ఒకటో తేది వచ్చింది...పింఛన్ పండుగను తంచనుగా తెచ్చింది.. బుధవారం జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్ పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. తెల్లవారకముందే ఆయా ప్రాంతాల్లోని వలంటీర్లు అర్హులైన వారి ఇళ్లకు వెళ్లారు. అవ్వాతాతలను పలుకరించారు. కుశల ప్రశ్నలు వేశారు. అనంతరం పింఛన్ నగదును అందజేశారు.మొదటి రోజే పింఛన్‌దారులకు వలంటీర్ల ద్వారా 87.66 శాతం మందికి పింఛన్‌లు అందజేసినట్లు వెలుగు పీడీ సత్యనారాయణ తెలిపారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 2,17,001 మందికి రూ.59.86 కోట్లు మంజూరైందన్నారు. బుధవారం వేకువ జాము నుంచి ఇంటింటికి వలంటీర్ల ద్వారా పింఛన్లు అందజేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మొదటి రోజు రాత్రి 7-30 గంటల వరకు 1,90,214 మందికి రూ.52.47 కోట్లు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన పింఛన్లను కూడా మరో రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని చెప్పారు. వేలిముద్ర ద్వారా అందని వారికి కంటి చూపును గుర్తించి పింఛన్ అందజేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్లు ఇంటివద్దకే వచ్చి పింఛన్ నగదును అందజేయడం పట్ల అవ్వాతాతలు ఆనందంతో పరవశించిపోయారు.

ప్రారంభమైన పుష్పగిరి ప్రదక్షిణ

వల్లూరు: ప్రఖ్యాతి గాంచిన పుష్పగిరి పుణ్యక్షేత్రంలో బుధవారం గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. పుష్పగిరి కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ సమీపంలో పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామి, కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డిల సమక్షంలో గిరి ప్రదక్షిణకు గానూ వేద పండితులు ముందుగా శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిలు కొబ్బరి కాయలను కొట్టి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో కలిసి కొంత దూరం నడక సాగించారు. మార్గ మధ్యలో ఉన్న శ్రీ దుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి, కార్పొరేటర్ పాకా సురేష్, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



గిరి ప్రదక్షిణలో పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతీ స్వామి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

పుష్పగిరి ప్రదక్షిణ సకల దేవతా ప్రదక్షిణ ఫలాన్ని ఇస్తుంది

రామాయణం గ్రంథాల దగ్గర నుండి మనకు పుష్పగిరి క్షేత్ర విశిష్టత కనిపిస్తుంది. ఎంతో మంది భారత దేశ సంప్రదాయంలో గురువులుగా వున్నవారు దర్శించి దైవతా తత్వాన్ని, గురు తత్వాన్ని స్థాపించిన దివ్య క్షేత్రం పుష్పగిరి. గురు పరంపరలో శాక్తేయ, వైష్ణవ, శైవాది సమస్త ఆగమాలు కూడా ప్రాణం పోసుకున్న స్థలం. శ్రీశైలానికి నైరుతీ ద్వారంగా వున్న స్థలం. ఇలా చెప్పుకుంటూ పోతే పుష్పగిరి క్షేత్రం ఎంతో విశిష్టమైనది. దేవ గిరి పుష్పగిరి, అరుణ గిరి పుష్పగిరి. ఇది భాస్కర క్షేత్రం. ఈ పుష్పగిరిని ప్రదక్షిణ చేస్తే సకల దేవతా ప్రదక్షిణ చేసిన ఫలాన్ని పొందుతామని పుష్పాచల ఖండంలో కూడా వుంది.

– శ్రీ విద్యా శంకర భారతీ స్వామి, పుష్పగిరి పీఠాధిపతి

పుష్పగిరి ప్రదక్షిణ శుభప్రదం

గతంలో ఈ క్షేత్రంలో జరుగుతూ కాల క్రమంలో నిలిచి పోయిన గిరి ప్రదక్షిణను తిరిగి ప్రారంభించడం శుభ దాయకం. ఈ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామి చేతుల మీదుగా ప్రారంభించడం చాలా సంతోషకరం. గిరి ప్రదక్షిణ ఎంతో పుణ్య కార్యం. దీని వలన ఈ ప్రాంతంతో బాటుగా ప్రజలకు , ప్రదక్షిణ చేసే భక్తులకు ఎంతో మేలు జరుగుతుంది. గిరి ప్రదక్షిణకు పేరు గాంచిన అరుణాచల క్షేత్రం మాదిరిగానే పవిత్రమైన క్షేత్రం పుష్పగిరి. శాటిలైట్ ద్వారా చూస్తే ఆంజనేయ స్వామి పాదం కనిపిస్తుందని చెపుతారు.

– పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే , కమలాపురం

3,4 తేదీల్లో వైవీయూలో రీజినల్ క్విజ్ చాంపియన్‌షిప్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 3, 4 తేదీల్లో ప్రాంతీయస్థాయి క్విజ్ చాంపియన్‌షిప్-23 నిర్వహించనున్నట్లు వైవీయూ ఆంగ్లశాఖ సహ ఆచార్యులు, క్విజ్ చాంపియన్‌షిప్ నిర్వాహకులు డాక్టర్ ఆర్.వి. జయంత్‌కశ్యప్, ఏపీ ఉన్నత విద్యామండలి క్విజ్ సమన్వయకర్త ఎం. రమేష్‌కుమార్ తెలిపారు. ఏపీ ఉన్నత విద్యామండలి మార్గదర్శకం మేరకు క్విజ్ పోటీలకు రాయలసీమ, నెల్లూరు జిల్లాలలోని వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి 33 టీంలు హాజరవుతున్నట్లు తెలిపారు. క్విజ్ పోటీలను ప్రిలిమ్స్, క్వాలిఫైయింగ్, క్వార్టర్ ఫైనల్స్‌గా మూడుదశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రీజినల్ స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఏపీ ఉన్నతవిద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించే సెమీఫైనల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి సలహాదారు ధనుంజయరెడ్డి



మాట్లాడుతున్న సీఎం సలహాదారు ధనుంజయరెడ్డి

కడప కార్పొరేషన్ : ఎమ్మెల్సీ ఎన్నికలను జేసీఎస్ మండల ఇన్‌ఛార్జిలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి సలహాదారు ఆర్.ధనుంజయరెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం శిల్పారామం కన్వెన్షన్ హాలులో ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు, అనంతపురం జిల్లాల జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల (జేసీఎస్) మండల ఇన్‌ఛార్జిలతో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13వ తేదీ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్లను మనవైపు తిప్పుకోవడానికి కసరత్తు చేయాలన్నారు. జేసీఎస్ ఇన్‌ఛార్జిలు కీలకంగా పనిచేయాలన్నారు. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 34,108 ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వగా, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2.6 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలు కలుపుకుని 6.16 లక్షల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం సౌకర్యాల కల్పన కోసమే డీబీటీ ద్వారా నగదు ఖాతాలకు జమ చేయడం జరుగుతోందని, విద్య, వైద్య, వ్యవసాయ రంగాలలో సమూల మార్పులు తీసుకు రావడం జరిగిందన్నారు. 2008 డీఎస్సీ ద్వారా ఎంపికైన 6304 మందికి ఉపాధ్యాయ పోస్టులు ఇవ్వడం జరిగిందని, 10 వేల మందికి పైగా లాగ్వేంజ్ పండిట్లుకు, 263 మంది పీఈటీలకు, 11,394 మంది టీచర్లకు పదోన్నతులు కల్పించామన్నారు. రిటైర్‌మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచామన్నారు. పీఈటీలు, కంప్యూటర్ టీచర్ల వేతనాలను రూ. 15 వేల నుంచి రూ. 44 వేలకు పెంచామన్నారు. ఎనిమిది వేల మంది టీచర్లను సబ్జెక్టు టీచర్లుగా గుర్తించి పదోన్నతులు ఇచ్చామని, 2227 మందికి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించామన్నారు. ఈ విషయాలన్నీ పట్టభద్రులు, ఉపాధ్యాయులకు వివరించి వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓట్లు వేసేలా చూడాలన్నారు.

- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ నాయకత్వంలో మనం అనేక ఎన్నికలను ఎదుర్కొన్నామని, ఆయన మరణానంతరం వైఎస్సార్ సీపీ స్థాపించాక కూడా ఎన్నికల్లో అనేక సవాళ్లను ఎదుర్కొన్నామన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా అలాగే చూడాలని, సాదాసీదా ఎన్నికలుగా భావించవద్దని హెచ్చరించారు.
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, , ఎంవీ రామచంద్రారెడ్డిలను గెలిపించేందుకు జేసీఎస్ కన్వీనర్లు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు.
- నగర మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లను గుర్తించడం సులువని, పట్టణ ప్రాంతాల్లో కొంచెం కసరత్తు చేయాల్సి ఉంటుందన్నారు. 2024లో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు ఇవి సెమీ ఫైనల్ లాంటివని గుర్తు చేశారు.
- ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో 98.5 శాతం ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.
- జేసీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను డోర్ డెలివరీ చేయడం జరిగిందన్నారు. ఫలితంగా ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని, అందులో పట్టభద్రుల కుటుంబాలు కూడా లబ్ధిపొంది ఉంటాయన్నారు.
- కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయంలో మదనపల్లె డిపో ఫస్ట్

మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లా పరిధిలో మదనపల్లె ఆర్టీసీ 1 డిపో ఈపీకే, ఓఆర్, కెఎంపీఎల్‌లలో మొదటి స్థానంలో నిలిచినట్లు డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఫిబ్రవరి నెలలో ఈపీకే 39.31, ఓఆర్ 73.20, కేఎంపీఎల్ 5.43 వచ్చినట్లు తెలిపారు. సిబ్బంది అందరి సహకారంతోనే ఆదాయం పెరిగినట్లు పేర్కొన్నారు. అందరూ కలిసి డిపో అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

క్లుప్తంగా

ఘనంగా సిరిమాను ఉత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

లక్కిరెడ్డిపల్లె : ఫిబ్రవరి 21,22 తేదీల్లో జరిగిన గంగమ్మ జాతర రోజున ఏర్పాటు చేసిన సిరిమానుకు బుధవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి కిందికి దించారు. దీనిని ఎనిమిది రోజుల పాటు ఉంచారు. చుట్టు పక్కల ప్రాంతాల వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు.బుధవారం వంద మంది భక్తులతో పూజారులు ఆది మూలం చంద్ర,రెడ్డిశేఖర్‌లు ,ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ప్రత్యేకాధికారి రవీంద్ర రాజు ఆధ్వర్యంలో భక్తులు సిరిమానును కిందకు దించి ఆలయం లోపల యథాస్థానంలో ఉంచారు.

గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

రాజంపేట : రాజంపేట బైపాస్‌రోడ్డులోని పద్మ ప్రియ కల్యాణమండపం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. శరీరం ఛిద్రమవడంతో మృతుడెవరో గుర్తుపట్టలేని విధంగా ఉంది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. అయితే మృతుడు నడిచివస్తుండగా ముందుగా గుర్తుతెలియని కారు ఢీ కొనడంతో, లారీతో తొక్కకుంటూ వెళ్లాయని సీసీ కెమరాల ద్వారా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని సంబంధీకులు గుర్తించేందుకు భద్రపరిచారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన సురేంద్రరెడ్డి

నిమ్మనపల్లె : రోడ్డుప్రమాదంలో వైఎస్సార్ సీపీ నాయకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రమణారెడ్డి సోదరుడైన వైఎస్సార్ సీపీ నాయకుడు సురేంద్రరెడ్డి(65) ఇంటి నుంచి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు బయలుదేరాడు. రాచవేటివారిపల్లె సమీపంలోని ఏటి వద్ద వెనుకనుంచి వచ్చిన లగేజి వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సురేంద్రరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. తల, ఇతర శరీరభాగాలపై గాయాలయ్యాయి. వాహన డ్రైవర్ లగేజి వాహనాన్ని అక్కడే వదిలి.. మరో వాహనంలో గాయపడిన సురేందర్‌రెడ్డిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి వెళ్లిపోయాడు. బాధితుడు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని ఔట్‌పోస్టు పోలీసులు నిమ్మనపల్లె పోలీసులకు తెలియజేశారు. సురేంద్రరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఫాతిమా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాల కోసం అక్క ఇంటికే కన్నం

- రూ.1.24 లక్షల నగలు స్వాధీనం
- నిందితుడు అరెస్ట్

బి.కొత్తకోట : జల్సాల కోసం అక్క ఇంటికే కన్నం వేసి దోచుకున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ కే.రామమోహన్ బుధవారం మీడియాకు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు..బి.కొత్తకోట నగర పంచాయతీ తాకాటంవారిపల్లెకు చెందిన డి.ఓబులేసు (28) మద్యం, జల్సాలకు అలవాటు పడ్డాడు. ఓబులేసుకు కూలీపనితో సంపాదించే డబ్బు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఓబులేసు అక్క ఉత్తమ్మ తాకాటంవారిపల్లెలోని ఇంటిలో ఉంటోంది. ఆమెకు బి.కొత్తకోటలోనూ ఇల్లు ఉంది. గతనెల 11న తాకాటంవారిపల్లెలోని ఇంటికి తాళంవేసి బి.కొత్తకొటకు వచ్చింది, పది రోజుల తర్వా తిరిగి తాకాటంవారిపల్లెకు వెళ్లింది. తాళం తీసి లోపలికి వెళ్లింది. బీరువా పగులగొట్టి ఉండటం గమనించింది. వెంటనే బీరువాలో చూడగా గలు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు చేధించేందుకు పోలీసులు బెంగళూరు, మైసూర్‌లో దర్యాప్తు చేశారు. పలువురి అదుపులోకి తీసుకుని విచారించారు. అయినా నిందితులు ఎవరో తేలకపోవడంతో స్థానికులపై అనుమానంతో నిఘా వేసి దర్యాప్తు ప్రారంభించడంతో బుధవారం నిందితుడు ఓబులేసు బత్తలాపురం క్రాస్ వద్ద ఉన్నట్టు గుర్తించి అరెస్ట్ చేశారు. చోరీపై విచారించగా ఉత్తమ్మ ఇంటికి కన్నంవేసింది సొంత తమ్ముడు ఓబులేసు అని నిర్ధారణ అయింది. గతనెల 11వ తేది రాత్రి 11 గంటల సమయంలో అక్క ఉత్తమ్మ ఇంటి తాళాలు తీసి లోపలికి ప్రవేశించి బీరువాలోని నగలను చోరీ చేసినట్టు నిర్ధారించారు. నిందితుని నుంచి రూ.1.24 లక్షల విలువైన ఒక నక్లెస్, జత కమ్మలు, జత జాలర్లలను స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేశామని తెలిపారు. నిందితుడిని మదనపల్లె కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు.


అరెస్టయిన నిందితుడు, నగలతో పోలీసులు

రాజంపేటలో వీధి ఆవుల తరలింపు!


మన్నూరులోకి ఖాళీ ప్రదేశంలోకి ఆవులను తరలిస్తున్న మున్సిపాలిటి సిబ్బంది

రాజంపేట : పట్టణంలోని వీధుల్లో సంచరిస్తున్న ఆవుల సంరక్షణ చర్యలను మున్సిపాలిటీ అధికారులు చేపట్టారు. ఈమేరకు బుధవారం పట్టణంలో పలు ప్రాంతాల్లోని రోడ్లలో సంచరిస్తున్న ఆవులను తమ ఆధీనంలోకి తీసుకిని మన్నూరులో శ్మశానవాటిక సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశంలోకి తరలించారు. తొలివిడతగా 60 ఆవులను మున్సిపాలిటీ సిబ్బంది వివిధ ప్రాంతాల నుంచి తరలించారు. కాగా పట్టణంలో 700కి పైగా ఆవులు ఉన్నట్లు మున్సిపాలిటీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.మున్సిపాలిటీ శానిటరి ఇన్‌స్పెక్టరు శంకర్, గోసంరక్షణ సేవాసమితి ఉపాధ్యక్షుడు వర్ధిబోయిన శ్రీధర్, నిర్వహక ప్రతినిధి అశోక్ కుమార్‌రెడ్డి , నందలూరు గోశాల నిర్వహక ప్రతినిధి రవి ఆవుల తరలింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆవులకు గో సంరక్షణ సేవాసమితి ఆధ్వర్యంలో మేత, నీటి సౌకర్యంను ఏర్పాటు చేశారు.

పెంపకందార్ల నుంచి కరువైన స్పందన

కొద్దిరోజులుగా మున్సిపాలిటీ అధికారులు ఆవులకు సంబంధించిన యజమానులు తీసుకెళ్లాలని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నోటీసులు ఇస్తామని, జరిమానాలు విధిస్తామని చెప్పినా ఆవుల యజమానుల నుంచి స్పందన కరవైంది. దీంతో శానిటరీ ఇన్‌స్పెక్టరు శంకర్ ఆధ్వర్యంలో ఆవులను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు స్పెషలడ్రైవ్ నిర్వహించారు. ఈ విధానం కొనసాగుతుందని వెల్లడించారు. గోవుల యజమానులు రాని పక్షంలో వాటిని తిరుపతి గోశాల తరలిస్తామని మున్సిపాలిటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి హెచ్చరించారు.

ప్రమాదంలో గాయపడిన వివాహిత మృతి


సుగుణ (ఫైల్)

బి.కొత్తకోట : గతనెల 24న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వివాహిత బుధవారం మృతి చెందింది.ఈ ఘటనలో గాయపడిన భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఏఎస్‌ఐ బొజ్జేనాయక్ కథనం మేరకు వివరాలు..బి.కొత్తకోట మండలం మొటుకుపల్లెకు చెందిన ఎం.మనోహర్‌తో ఐదేళ్ల క్రితం ఇదేమండలం దయ్యాలవారిపల్లెకు చెందిన సుగుణ(22)తో వివాహమైంది. మనోహర్ పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకొంటున్నాడు. వీరికి మూడేళ్ల కుమారుడు, తొమ్మిది నెలల కుమార్తె ఉంది. గతనెల 24 సాయంత్రం సుగుణ ఇంటిలో గ్యాస్ అయిపోవడంతో వంట చేసేందుకు ఇంటిపక్కనే ఉన్న పూరిగుడిసెలోని కట్టెల పొయ్యిలోకి టర్పాంటాయిల్ వేసి వెలిగిస్తుండగా చేతిలోని డబ్బా కిందకు పడి మంటలు వ్యాపించాయి. ఈ మంటల్లో సుగుణ కాలిపోతూ కేకలు వేయడంతో ఇంటిలోని భర్త మనోహర్ వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించే క్రమంలో చేతులకు మంటలు అంటుకున్నాయి. చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సుగుణ పరిస్థితి విషయంగా ఉండటంతో వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆమె మృతి చెందింది. మనోహర్ మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ బొజ్జేనాయక్ తెలిపారు.

మనస్తాపంతోనే ఉపాధ్యాయిని ఆత్మహత్య

మదనపల్లె : కుమారుడి పుట్టినరోజు వేడుకలను కేక్ కట్‌చేసి ఘనంగా నిర్వహించలేదన్న మనస్తాపంతోనే ప్రైవేట్ ఉపాధ్యాయిని ఛాయ(32) ఆత్మహత్యకు పాల్పడిందని, ఈ మేరకు పోస్టుమార్టం నివేదికలు, ప్రాథమిక సమాచారం అందిందని తాలూకా సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. కుమారుడు సాయినితేష్ పుట్టినరోజు సందర్భంగా ఫిబ్రవరి 27వతేదీ రాత్రి ఛాయ భర్త నాగేంద్రతో గొడవ పడింది. దీంతో ఆయన చాక్లెట్లు తెచ్చేందుకు వెళ్లగా అదేసమయంలో ఆమె ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సాయంతో గది తలుపులు పగులగొట్టి ఆమెను కిందకు దించినట్లు విచారణలో తేలింది. ప్రాథమిక పోస్టుమార్టం రిపోర్టులో ఛాయ ఉరివేసుకోవడం వల్లే చనిపోయినట్లు నివేదిక అందిందన్నారు. ఛాయ శరీరభాగాలను ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కు పంపామని, భర్త హింసించినట్లు తేలితే అతనిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయురాలి మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

అడవి పందుల కోసం విద్యుత్ తీగల ఏర్పాటు

- ఒకే రోజు 10 పందులు మృతి
- ఆందోళనలో ప్రజలు

పెద్దతిప్పసముద్రం : అడవి పందుల బారి నుంచి పంట పొలాలను కాపాడుకునేందుకు రైతులు ఎన్నో ప్రయత్నాలు చేపడుతూ ఉంటారు. పొలాల్లో విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తుంటారు. మండలంలోని మల్లెల, తుమ్మరకుంట, కమ్మచెరువు, సంపతికోట పంచాయతీల్లో కొంత మంది రాత్రి వేళల్లో గుట్టుగా జింకలు, అడవి పందులు, కుందేళ్ల కోసం అటవీ ప్రాంతాల్లో, పొలాల్లో విద్యుత్ తీగలు అమర్చారు. మండలంలోని సంపతికోట పంచాయతీ కొత్తపల్లి సమీపంలో మంగళవారం రాత్రి కొందరు పొలాల చుట్టూ అమర్చిన విద్యుత్ తీగలు తగిలి బుధవారం తెల్లారే సరికి 10 అడవి పందులు మృతి చెందాయి. గుట్టు చప్పుడు కాకుండా వాటిని ఇళ్లకు తీసుకెళ్ళిపోవడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. వేళ కాని వేళల్లో రాత్రి పూట రైతులు పొలాలు, మోటారు, స్టార్టర్ పెట్టెల వద్దకు వెళుతుంటారని, కరెంట్ ఉచ్చుల కారణంగా ప్రమాదవశాత్తు రైతులకు ప్రాణ నష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజల్లో ఆందోళన వ్యక్తమౌతోంది.

గతంలో విద్యుదాఘతంతో రైతు బలి

మండలంలోని మల్లెల పంచాయతి పెద్ద మేకలవారిపల్లికి చెందిన రెడ్డెప్ప (32) అనే వ్యక్తి 2012 సెప్టెంబర్ 19న బోరు పాయింట్ పెట్టేందుకు సమీపంలో ఉన్న కర్నాటక రాష్ట్రానికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామం చేరుకునేందుకు రెడ్డెప్ప కాలి నడకన అదే రోజు రాత్రి బయలు దేరాడు. ఈ క్రమంలో కొందరు సమీప పొలాల్లో అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు కాళ్లకు తగలడంతో షాక్‌కు గురై రెడ్డెప్ప మృతిచెందాడు. కరంటు తీగలు ఏర్పాటు చేసిన వ్యక్తులు శవాన్ని గుట్టుగా ఓ బావిలో గుంత తీసి పూడ్చి పెట్టి పరారయ్యారు. అప్పట్లో మృతుడి మిస్సింగ్ కేసు మిస్టరీగా మారడంతో అప్పటి సీఐ రమణ, ఎస్‌ఐ శ్రీరాముడు కేసును సవాల్‌గా తీసుకుని ఛేదించారు. అలాంటి చేదు ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండేందుకు పోలీసులు, అటవీ శాఖ, డిస్కం అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


అప్పట్లో రెడ్డెప్పను పూడ్చిన బావిని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

వృద్ధుడి దారుణహత్య

తంబళ్లపల్లె : బోరుబావి వద్ద సాగునీటి కోసం జరిగిన ఘర్షణలో వృద్ధ రైతు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన బుధవారం మండలంలో జరిగింది. ములకలచెరువు సీఐ షాదిక్‌అలీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలొని గోపిదిన్నె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన కురవలపల్లె నారాయణరెడ్డి(70), స్వయాన తమ్ముడు భాస్కర్‌రెడ్డి కుమారుడు నరేంద్రరెడ్డి(37) బుధవారం ఉదయం బోరు వద్దకు వెళ్లారు. నారాయణరెడ్డి గేట్‌వాల్ ద్వారా పంటకు నీళ్లు వదిలాడు. ఇంతలో నరేంద్రరెడ్డి గేట్‌వాల్ ఆఫ్ చేస్తుండగా వృద్ధుడు తన వద్ద ఉన్న చేతి ఊతకర్రతో కొట్టాడు. దీంతో అతను ఘర్షణకు దిగి తోసివేసి బండరాతితో కొట్టాడు. తీవ్ర గాయాలతో మృతి చెందాడు. చనిపోయాడనే భయంతో నరేంద్రరెడ్డి వృద్ధుడి మృతదేహాన్ని కొంత దూరంలొ ఉన్న బోరు మోటారు వద్ద ఉన్న స్టాటర్ వద్దు తీసుకెళ్లి విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడని తండ్రి, బంధువులకు ఫోన్‌లో చెప్పాడు. పొలానికి సమీపంలోని ఆలయం వద్ద ఉన్న గ్రామస్తులతో పెదనాన్న కరెంట్‌షాక్‌కు గురయ్యారని, విద్యుత్ సరఫరా నిలిపివేయాలని అరవడంతో అక్కడి వారు సరఫరాను నిలిపివేయించారు. గ్రామస్తులు, కుటుంబీకులూ సంఘటనా స్థలానికి చేరి తీవ్రరక్తస్రావంతో మృతి చెందిన నారాయణరెడ్డిని చూసి బోరున విలపించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ములకలచెరువు సీఐ షాదిక్ అలీ, మదనపల్లె డీఎస్పీ కేశప్పలు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. స్థానిక వీఆర్వో విశ్వంబరనాయుడు సమక్షంలో పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు ఆనంద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కేశప్ప, సీఐ షాదిక్ అలీ (ఇన్‌సెట్) నారాయణరెడ్డి మృతదేహం

బియ్యంతో కలిసిన యూరియా తిని గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

వీరబల్లి : మండలంలోని వంగిమళ్ల గ్రామం గొల్లపల్లిలో బియ్యంతో కలిసిన యూరియాను తినడం వల్ల ఏడు గొర్రెలు మృతి చెందాయి.బాధితుడు అనగాని వెంకటరమణ, స్థానికుల కథనం మేరకు గొర్రెల కాపరులు గొర్రెలను మేత కోసం ఊరి చివరన పొలం వద్దకు తోలుకెళ్లారు.కొందరు బియ్యం కలిసిన యూరియాను పొలం సమీపంలోని బావిలో పడేసేందుకు తీసుకెళ్లారు.అందులో కొంత బావిపైన ఉన్న గట్టు మీద పడ్డాయి. వాటిని తినడం వల్ల గొర్రెలు చనిపోయాయని బాధిత కుటుంబం వాపోతోంది. ఒకే సారి ఏడుగొర్రెలు మృతి చెందడంతో రూ. లక్ష వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

నీట మునిగి పాలిటెక్నిక్ విద్యార్థి మృతి

పీలేరురూరల్ : సరదాగా ఈతకెళ్లి పాలిటెక్నిక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన అన్నమయ్య జిల్లా పీలేరు మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలాఉన్నాయి. సత్యసాయి జిల్లా బుగ్గపట్నం మండలం కృష్ణాపురానికి చెందిన టి. నల్లప్ప కుమారుడు టి. రఘునాథ (16) స్థానిక ఎంజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ ట్రిపుల్–ఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని వైవీఆర్ హాస్టల్‌లో ఉంటూ కళాశాలకు వెళ్లి వచ్చేవారు. బుధవారం స్నేహితులు ఐదుగురితో కలసి గుర్రంవారి కుంటకు సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. నీటిలో దిగిన రఘునాథ బయటికి రాలేదు. దీంతో స్నేహితులు హాస్టల్ వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.


నీటి నుంచి మృతదేహాన్ని వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఇన్‌సెట్) రఘునాథ మృతదేహం

బైక్ అదుపు తప్పి ఇద్దరు దుర్మరణం


అలోక్, అంకయ్య మృతదేహాలు

మైదుకూరు : వైఎస్సార్‌జిల్లా మైదుకూరు - ప్రొద్దుటూరు రహదారిపై బుధవారం రాత్రి బైక్ అదుపుతప్పి ఖాజీపేట మండలం మల్లాయపల్లె కు చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు.వివరాలిలా ఉన్నాయి.మల్లాయపల్లె ఎస్సీ కాలనీకి చెందిన అలోక్ (32),అంకయ్య (25) అనే తోడల్లుళ్లు తమ బావమరిది మనోజ్ ను బెంగళూరు వెళ్లేందుకు మైదుకూరు రాయల్ సెంటర్లో బస్సు ఎక్కించారు.బస్సు బయలు దేరాక ఇద్దరూ బైకుపై బస్సు వెనకాల వేగంగా వెళ్లారు.ప్రొద్దుటూరు రోడ్డులోని హైవే బ్రిడ్జి వద్ద బైకు అదుపు తప్పి ఇద్దరూ కింద పడ్డారు. తీవ్రంగా గాయపడ్డారు. ఇదంతా బస్సులోనుంచి గమనిస్తున్న మనోజ్ బస్సును ఆపించి దిగాడు.అక్కడున్న డాబా వద్ద ఉన్నవారు 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు.అంబులెన్స్ లో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా ఇద్దరు మృతి చెందారు.

విద్యుదాఘాతంతో రైతు..

పెండ్లిమర్రి : వైఎస్సార్‌జిల్లా మమ్ముసిద్దుపల్లె గ్రామానికి చెందిన సి.రాజగోపాల్‌రెడ్డి(62) అనే రైతు బుధవారం విద్యుదాఘాతంతోమృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు రాజగోపాల్‌రెడ్డి మొయిళ్లకాల్వ గ్రామ సమీపంలో ఉన్న తన పొలంలో పొలం పని చేసుకుంటూ ఉండగా పక్కన ఉన్న వ్యవసాయ బోరుకు సంబంధించిన విద్యుత్ తీగ ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పొస్టుమాస్టరం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తి చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

పంట పొలాల్లో కొండచిలువ ప్రత్యక్షం


గడ్డికింద ఉన్న కొండచిలువ

అట్లూరు : వైఎస్సార్‌జిల్లాబద్వేలు మండలం రాజుపాలెం గ్రామ సమీపంలోని పొలాలలో బుధవారం కొడచిలువ కనిపించింది. దీంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల కథనం మేరకు మామిడి తోటలలో సుమారు పది అడుగులకు పైబడిన పొడవు గల కొండచిలువ తిరుగతూ కనిపించింది. గమనించిన రైతులు సిద్దవటం రేంజ్ అధికారి ప్రసాద్‌కు సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు వెంటనే సెక్షన్ అధికారి సురేష్, బీట్ ఆఫీషర్ విశ్వనాధరెడ్డి, ప్రొటక్షన్ వాచర్ రమణా కొండచిలువ ఉన్న ప్రదేశానికి వెళ్లి దానికి పట్టుకుని ఓ డ్రమ్ములో బంధించారు. అనంతరం లంకమల్లేశ్వర అభయారణ్యం లోని కొడూరు బీట్ పరిధిలో విడిచిపెట్టారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

లక్ష్యసాధనకు కష్టపడాలి

ప్రొద్దుటూరు : విద్యార్థులు లక్ష్య సాధనకు కష్టపడాలని తిరుపతి ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య తెలిపారు. బుధవారం సాయంత్రం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రణాళిక ప్రకారం చదివాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యూనివర్సిటీ డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ జేవీ రమణ మాట్లాడుతూ పశువైద్య విద్యార్థులకు ఉన్న ఉద్యోగావకాశాల గురించి వివరించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వైకుంఠరావు కళాశాల విద్యార్థులు సాధించిన ప్రగతి వివరాలను వెల్లడించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను అందరినీ ఆలరించాయి. కార్యక్రమంలో ఆఫీస్ ఆఫ్ స్టూడెంట్ యాక్టివిటీస్ డాక్టర్ ఎన్. వినోద్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాములు పట్టివేత


పాములను పట్టి మెడలో వేసుకున్న ఖాదర్‌బాషా

రామసముద్రం : రామసముద్రంలో మూడు పాములు హల్చల్ చేయడంతో వాటిని పట్టి ఓ వ్యక్తి మెడలో వేసుకొని గ్రామంలో తిరిగాడు. ఈ సంఘటన బుధవారం రామసముద్రంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రామసముద్రం ఆంజనేయస్వామి కాలనీలో ఓ ఇంటిలోకి జెర్రిపోతు, ఒకనాగుపాము చేరడంతో కుటుంబీకులు భయాందోళనకు గురయ్యారు. పాములు పట్టే ఖాదర్‌బాషాకు సమాచారం అందించారు.అతని వాటిని పట్టుకున్నాడు. అలాగే మరో ఇంటిలోకి జెర్రిపోతు చేరడంతో మూడుపాములను పట్టుకొని వాటిని మెడలో వేసుకొని వెళ్లి బయటదూరంగా వదిలేశాడు. ఎక్కడ పాములు ఉన్న తనకు సమాచారం ఇస్తే వాటిని పట్టివేస్తానని ఖాదర్‌బాషా తెలిపాడు.

ప్లాస్టిక్ ఫ్యాక్టరీలో కెమికల్ డబ్బా పేలి ప్రమాదం

ఆరుగురికి గాయాలు


గాయపడిన గౌస్‌బీ, రాహుల్‌కుమార్, లక్ష్మణ్

ప్రొద్దుటూరు క్రైం : పాత ప్లాస్టిక్ వస్తువుల ఫ్యాక్టరీలో కెమికల్ డబ్బా పేలి ఏడుగురు గాయ పడ్డారు. డబ్బా మూత రాకపోవడంతో రాడ్డుతో గట్టిగా కొట్టగా పెద్ద శబ్దంతో అది పేలిపోయింది. పోలీసుల కథనం మేరకు.. వైఎస్సార్‌జిల్లా కొత్తపల్లె బైపాస్‌రోడ్డు సమీపంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో మహమ్మద్ ఆలీ స్టార్ ప్లాస్టిక్ పేరుతో ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నాడు. పట్టణంతో పాటు గ్రామాల్లో సేకరించిన ప్లాస్టిక్ బాటిళ్లు, పగిలిన ప్లాస్టిక్ బిందెలను ఇక్కడి ఫ్యాక్టరీకి తరలిస్తారు. బాటిళ్లు, బిందెలను వేరు చేసేందుకు పలువురు కూలీలు అందులో పని చేస్తున్నారు. బుధవారం కూలీలు పని చేస్తున్న సమయంలో వారికి ఒక పాత ప్లాస్టిక్ డబ్బా కనిపించింది. డబ్బాను తెరిచేందుకు రాడ్డుతో కొట్టగా అది ఒక్కసారిగా పేలింది. అందులో కాలం చెల్లిన కెమికల్ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనలో చౌడేశ్వరి, మాబుచాంద్, అచ్చుకట్ల గౌస్‌బీ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్‌కుమార్, లక్ష్మణ్, రాజేష్‌లు గాయ పడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో అచ్చుకట్ల గౌస్‌బీకి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. తీవ్ర గాయాలైన వారిని మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్‌ఐ సంజీవరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైవీయూ ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్‌గా సుబ్రమణ్యం


ఐక్యూఏసీ సెల్ సభ్యులతో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం అంతర్గత నాణ్యత హామీ (ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్) విభాగం సంచాలకులుగా డాక్టర్ లోకా సుబ్రమణ్యంశర్మ (కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్)ను నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య నియామక పత్రాన్ని అందజేశారు. వీసీ ఆచార్య జింకా రంగజనార్ధన ఆదేశాల మేరకు నియామకం చేపట్టినల్లు తెలిపారు. ఉప సంచాలకులుగా డా. సుభోష్‌చంద్ర (మైక్రోబయాలజీ), సభ్యులుగా డా. టి. లక్ష్మీప్రసాద్ (ఎర్త్‌సైన్స్), డా. కె. వెంకటేశ్వర్లు (కెమిస్ట్రీ), డా. కె. రియాజున్నీసా (బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మాటిక్స్), డా. ఎల్. దాక్షాయని (జెనిటిక్స్ అండ్ జీనోమిక్స్), డా. టి. శ్యాంస్వరూప్ (జర్నలిజం)లను నియమించారు. వీరందరికీ రిజిస్ట్రార్ నియామక పత్రాన్ని అందజేసి, క్రియాశీలకంగా విధులు నిర్వహించాలని సూచించారు.